సాక్షి
ఆదిలాబాద్

సోమవారం । 5 । మే । 2025



బాసర చూసొద్దామా..
చదువుల తల్లి కొలువుదీరిన బాసరలో గతంలో వ్యాసుడు నివసించినందున వ్యాసపూరిగా పిలిచేవారు. క్రమేణ వాసర..బాసరగా మారింది. 10లో▸



సత్ఫలితాలిస్తున్న గడ్డిమైదానాలు
వన్యప్రాణుల సంతతి వృద్ధి కోసం జన్నారం డివిజన్‌లో పెంచుతున్న గడ్డి మైదానాలు సత్ఫలితాలిస్తున్నాయి. విత్తనాలు సేకరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. 10లో▸

గరిష్టం/కనిష్టం
37.0/26.0

వాతావరణం
మధ్యాహ్నం ఎండవేడిమి కొంతమేర తగ్గనుంది. పలుచోట్ల ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మందుబాబులపై కొరడా

- బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన పలువురిపై కేసు
- జిల్లా కేంద్రంలో పోలీసుల విస్తృత తనిఖీలు



బహిరంగ ప్రదేశంలో మద్యం తాగిన యువకుడిని అదుపులోకి తీసుకున్న సీఐ

సాక్షి ఎఫెక్ట్..

ఆదిలాబాద్‌టౌన్: మందుబాబులపై పోలీసులు కొరడా ఝుళిపించారు. బహిరంగ ప్రదేశాలు, రోడ్ల పక్కన కూర్చొని మద్యం తాగే వారిపై కేసులు నమోదు చేశారు. 'రోడ్లపైనే సిట్టింగ్' శీర్షికన 'సాక్షి'లో ఆదివారం కథనం ప్రచురితమైంది. ఈ మేరకు స్పందించిన వన్‌టౌన్, టూటౌన్ సీఐలు పట్టణంలో విస్తృత తనిఖీలు చేపట్టారు. టూటౌన్ పరిధిలో గల ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనం, రవితేజ హోటల్, పంజాబ్ హోటల్, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో మద్యం తాగుతున్న వారిని పట్టుకున్నారు. 10 మందిపై కేసులు నమోదు చేసినట్లు టూ టౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. అలాగే వన్‌టౌన్ సీఐ సునిల్‌కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. పలువురిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎవరైనా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఘనంగా భగీరథ మహర్షి జయంతి



నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: భగీరథ మహర్షి జయంతి వేడుకలను జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్ రాజర్షి షా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉప్పరసగర కులస్తులు, బీసీ సంక్షేమ శాఖ ఉద్యోగులతో కలిసి భగీరథుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ, భగీరథ మహర్షిని ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణకు కృషి చేయాలన్నారు. ఇందులో జిల్లా బీసీ సంక్షేమాధికారి కె. రాజలింగు, సూపరింటెండెంట్ సంజీవ్‌కుమార్, ఉప్పరసగర సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్ పాల్గొన్నారు.



నార్నూర్ మండలం బాలన్‌పూర్ చెరువు మట్టిని ట్రాక్టర్ ద్వారా పంట చేలకు తరలిస్తూ..

డబుల్ ధమాకా

- ఇటు పూడికతీత.. అటు చేలకు నల్లమట్టి
- చెరువుల్లో నీటి సామర్థ్యం పెంపు
- చేనుకు సైతం భూసారం
- నార్నూర్, గాదిగూడ మండలాల రైతుల్లో హర్షం

కాలువల ద్వారా వచ్చిన మట్టి పేరుకుపోవడంతో చెరువుల్లో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయింది. పూడికతీతతో ఈ సామర్థ్యం పెరగనుంది. తద్వారా పూర్తిస్థాయిలో నిండి రానున్న సీజన్‌లో రైతులకు వానాకాలంలోనే కాకుండా యాసంగిలోనూ పంటలకు నీటి తడులు అందించేందుకు దోహదపడనుంది. మరోవైపు పూడికతీతతో వచ్చిన నల్ల మట్టిని రైతులు చేలకు తరలిస్తున్నారు. దీంతో ఆ భూమి సారం పెరిగి పంట ఎదుగుదల, దిగుబడులకు దోహదపడనుంది. ఇది నార్నూర్, గాదిగూడ మండలాల్లోని రైతులకు డబుల్ ధమాకా. ప్రస్తుతం ఈ మండలాల్లోని 14 చెరువుల పూడికతీతకు శ్రీకారం చుట్టగా ఇప్పటికే రెండు చోట్ల పనులు ప్రారంభమయ్యాయి. అన్నదాత మోములో ఆనందం వెల్లివిరుస్తోంది.

– సాక్షి, ఆదిలాబాద్

నీతి ఆయోగ్ ఆస్పిరేషనల్ బ్లాక్‌లో భాగంగా నార్నూర్, గాదిగూడ మండలాల్లో సరోవర్ సమృద్ధి పైలట్ పథకం కింద 14 చెరువుల్లోని మట్టి, పూడికతీత కోసం ఇటీవల పనులు మొదలయ్యాయి. ప్రధానంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరువుల పూడికతీతపై దృష్టి పెట్టిన నేపథ్యంలో గ్రామాల్లో రైతులకు ఇది రెండు విధాలుగా ఉపయుక్తంగా మారుతోంది. చెరువుల్లో నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతో పాటు ఇటు రైతులు నల్లమట్టిని తమ పంటపొలాలకు భూసారం పెంపుకోసం తరలిస్తున్నారు.

నీటి నిల్వ పెరిగి..

జిల్లాలో రైతులు 70శాతానికి పైగా వర్షాధారంగానే పంటలు సాగు చేస్తున్నారు. గ్రామాల్లో చెరువుల కింద వందల ఎకరాల నుంచి కొన్ని చోట్ల 3వేల ఎకరాల వరకు ఆయకట్టు ఉంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం నార్నూర్, గాదిగూడ మండలాల్లో చెరువుల పూడికతీత చేపడుతుండగా, ఆయకట్టు రైతులకు వానాకాలం, యాసంగిలో పంటలకు నీటితడులు అందించేందుకు దోహదపడనుంది.

పెరగనున్న భూసారం

జిల్లాలో వ్యవసాయ భూముల్లో సారం కోల్పోయి రైతులు పంట ఎదుగుదల, దిగుబడుల్లో నష్టాలు చవిచూస్తున్నారు. ప్రధానంగా రసాయన ఎరువుల వాడకం పెరిగిపోవడంతో ఈ పరిస్థితి ఉందని వ్యవసాయ శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. దీనివల్ల ఆ భూమిలో నీటి నిల్వ శక్తిని కోల్పోతుంది. ప్రధానంగా సేంద్రియ ఎరువు భూమిలో రెండు శాతం కనీసంగా ఉంటే నీటిని నిల్వ ఉంచుకునే శక్తి ఉంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అయితే మన భూముల్లో పాయింట్ శాతంలోనే సారం ఉండటంతో పంటల ఎదుగుదలలో క్షీణత ఉంది. ప్రధానంగా పశువుల పేడ దొరకడం ప్రస్తుతం గగనంగా మారింది. లభ్యమైనా ఖరీదు ఎక్కువ కావడంతో రైతులు దాన్ని ఉపయోగించలేని పరిస్థితి. దీంతో భూసారం క్రమంగా క్షీణిస్తుంది. ఈ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయంగా చెరువులో నిల్వ ఉన్న నల్లమట్టిని వ్యవసాయ భూముల్లోకి చేర్చడం ద్వారా భూసారం పెంపొందించేందుకు ఉపయుక్తంగా ఉంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

ఎప్పటికప్పుడు పూడికతీయాలి



సేంద్రియ ఎరువుల వాడకం ఇటీవల తగ్గింది. ఈ క్రమంలో భూసారం పెంచుకునేందుకు చెరువు పూడికతీతతో వచ్చిన మట్టిని పొలాల్లో వేసుకుంటున్నాం. దీంతో దిగుబడి పెరగనుంది. అయితే ఎప్పటికప్పుడు చెరువుల్లో పూడికతీస్తే బాగుంటుంది.

– కోవ మోతీరాం, రైతు, బాలన్‌పూర్, నార్నూర్ మండలం

సేంద్రియ ఎరువు ఖర్చు పెరిగింది



పశువుల పేడముందు లాగా విరివిగా దొరకడం లేదు. ఈ పరిస్థితుల్లోనే రసాయన ఎరువులను వాడుతున్నాం. ఇప్పుడు పూడిక తీత ద్వారా వచ్చిన నల్లమట్టితో మా భూముల్లో భూసారం పెరగనుంది. శాస్త్రవేత్తలు కూడా ఇదే చెప్పారు. అందుకే చెరువు మట్టిని నా చేనులో వేసుకున్నా.

– కోవ దీపక్, రైతు, బాలన్‌పూర్, నార్నూర్ మండలం

రైతులకు మేలు..



సహజంగా సేంద్రియ ఎరువుల వాడకం ద్వారా భూసారం పెరిగి వర్షపునీటి నిల్వశక్తి పెంపొందుతుంది. తద్వారా మొక్కల పెరుగుదలకు బలం చేకూర్చుతుంది. అయితే రసాయన ఎరువులు దుష్ప్రభావం చూపుతున్నాయి. చెరువు మట్టిని పూడికతీత ద్వారా తీస్తుండగా దాన్ని పంట పొలాల్లో వేసుకుంటే రైతులకు సేంద్రియ ఎరువుకు ప్రత్యామ్నాయంగా ఉపయోగపడుతుంది. – శ్రీధర్‌చౌహాన్, వ్యవసాయ శాస్త్రవేత్త

ప్రశాంతంగా 'నీట్'



పరీక్ష కేంద్రంలోనికి వెళ్తున్న విద్యార్థులు

- పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు
- ముందుగానే చేరుకున్న విద్యార్థులు
- కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్, ఎస్పీ



చెవి కమ్మలు తీసివేస్తున్న విద్యార్థిని



కాలు పట్టీలు తీసివేస్తూ..

ఆదిలాబాద్‌టౌన్: వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించిన నేషనల్ ఎలిజిబిలిటీ ఎంట్రెన్స్ టెస్ట్ (నీట్) ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లా కేంద్రంలో ఏడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అభ్యర్థులను లోనికి అనుమతించారు. అందరూ నిర్దేశిత సమయానికి ముందుగానే చేరుకున్నారు. ఆయా సెంటర్ల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆయా కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించారు. కాగా, ఎట్టి పరిస్థితుల్లోనూ కేంద్రాల్లోకి బ్యాగ్‌లు, ఆభరణాలు, లోహ, ఎలక్ట్రానిక్ తదితర వస్తువులను అనుమతించమని అధికారులు ముందుగానే ప్రకటించారు. అయితే కొందరు అభ్యర్థులు ఆభరణాలతో రాగా అవి తీసిన తర్వాతే సిబ్బంది వారిని లోనికి అనుమతించారు.

1,621 మంది హాజరు..

జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఏడు కేంద్రాల్లో 1,659 మంది విద్యార్థులకు గాను 1,621 మంది హాజరయ్యారు. 38 మంది గైర్హాజరయ్యారు. పట్టణంలోని బంగారుగూడ తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన కేంద్రంలో 360 మందికి గాను 348 మంది హాజరు కాగా, 12 మంది గైర్హాజరయ్యారు. బంగారుగూడ మైనార్టీ రెసిడెన్షియల్‌లో 264 మందికి గాను 256 మంది హాజరుకాగా, 8 మంది గైర్హాజరయ్యారు. బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో 240 మందికి గాను 237 మంది హాజరు కాగా, ముగ్గురు గైర్హాజరయ్యారు. ప్రభుత్వ బాలికల పాఠశాలలో 240 మందికి గాను 234 మంది హాజరుకాగా, ఆరుగురు గైర్హాజరయ్యారు. ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో 240 మందికి గాను 236 హాజరు కాగా, నలుగురు గైర్హాజరయ్యారు. ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాలలో 340కి గాను 238 మంది హాజరు కాగా, ఇద్దరు గైర్హాజరయ్యారు. మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల కేంద్రంలో 75 మందికి గాను 72 మంది హాజరు కాగా, ముగ్గురు గైర్హాజరయ్యారు. ఆయా కేంద్రాలను కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్ పర్యవేక్షించారు. ఏర్పాట్లపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అభ్యర్థులకు ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించినట్లు పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

- నేటి నుంచి ఈనెల 13 వరకు..
- అన్నదాతలకు అవగాహన
- నేడు పొన్నారిలో ప్రారంభం



ఆదిలాబాద్‌టౌన్: ఆరుగాలం కష్టపడి పంటలు పండించే అన్నదాతలకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం 'రైతుల ముంగింట్లో శాస్త్రవేత్తలు' అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జిల్లాలోని ఆయా గ్రామాల్లోకి శాస్త్రవేత్తలు వెళ్లి రైతులకు పలు సలహాలు, సూచనలు అందించనున్నారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి ఏవిధంగా సాధించాలనే విషయాలపై అవగాహన కల్పించనున్నారు. తాంసి మండలం పొన్నారి గ్రామంలో ఈ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించనున్నారు. జిల్లాలోని 44 గ్రామాల్లో కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు ఇందులో పాల్గొంటారు. వీరితో పాటు వ్యవసాయ శాఖ, పశుసంవర్ధక శాఖ అధికారులు రైతులకు సూచనలు అందించనున్నారు.

రైతులను చైతన్యపర్చేందుకు..

రైతులను చైతన్యపర్చేందుకు ప్రభుత్వం రైతు ముంగింట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని చేపట్టింది. ఈనెల 5 నుంచి 13 వరకు రైతుల చెంతకు శాస్త్రవేత్తలు వెళ్లనున్నారు. తొమ్మిది బృందాలుగా గ్రామాల్లో పర్యటిస్తారు. సాగు పద్ధతులపై అవగాహన కల్పిస్తారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించడం, సస్యరక్షణ చర్యలు, ఏయే భూముల్లో ఏయే పంటలు వేయాలి తదితర విషయాలను రైతులకు తెలియజేస్తారు. వారి సందేహాలను నివృత్తి చేస్తారు. కాగా కృషి విజ్ఞాన కేంద్రం నుంచి ఆరుగురు శాస్త్రవేత్తలు, వ్యవసాయ పరిశోధన స్థానం నుంచి ఐదుగురు శాస్త్రవేత్తలు, వ్యవసాయ కళాశాల నుంచి ఏడుగురు శాస్త్రవేత్తలు ఈ కార్యక్రమాల్లో పాల్గొంటారు. వ్యవసాయ కళాశాలకు సంబంధించి 14 గ్రామాల్లో, కృషి విజ్ఞాన శాస్త్రవేత్తలు 18 గ్రామాల్లో, వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తలు 12 గ్రామాల్లో పర్యటిస్తారు.

ఈనెల 13 వరకు కార్యక్రమాలు

ఈనెల 5 నుంచి 13 వరకు రైతు ముగింట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని చేపడుతున్నాం. రైతుల చెంతకు వెళ్లి అవగాహన కల్పిస్తాం. అధిక దిగుబడులు ఏవిధంగా సాధించాలి, రసాయనాల వాడకం తగ్గించడం, ఏయే పంటలు సాగు చేయాలి, వాటికి ఆశించే చీడపీడల గురించి తెలియజేస్తాం. సోమవారం పొన్నారి గ్రామంలో ప్రారంభిస్తున్నాం. రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– రాజశేఖర్, కేవీకే శాస్త్రవేత్త

'భూభారతి'పైనే ఆశలు

- పైలట్ ప్రాజెక్ట్‌గా భోరజ్ మండలం ఎంపిక
- నేటి నుంచి గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులు
- మూడు ప్రత్యేక బృందాల నియామకం



కోర్టా గ్రామంలో ఇటీవల రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు(ఫైల్)

కైలాస్‌నగర్: భూ సమస్యలు పరిష్కరించి రైతులకు భరోసా కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి రెవెన్యూ చట్టాన్ని తీసుకువచ్చిన సంగతి తెలిసిందే. ఈ చట్టం అమల్లో భాగంగా జిల్లాలో కొత్తగా ఏర్పడిన భోరజ్ మండలాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేశారు. నేటినుంచి ఈ నెల 16వరకు గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారు. షెడ్యూల్ ఖరారుతో పాటు తహసీల్దార్ల ఆధ్వర్యంలో మూడు ప్రత్యేక బృందాలను నియమిస్తూ కలెక్టర్ రాజర్షిషా ఉత్తర్వులు జారీ చేశారు. అధికారులే స్వయంగా క్షేత్రస్థాయికి వెళ్లనున్న నేపథ్యంలో తమ సమస్యల పరిష్కారం కోసం రైతులు గంపెడాశలు పెట్టుకున్నారు.

తహసీల్దార్ల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు..

భోరజ్ తహసీల్దార్ ఎల్.రాజేశ్వరీ, భీంపూర్ తహసీల్దార్ కె.నలంద ప్రియ, బేల తహసీల్దార్ రఘునాథ్ ఆధ్వర్యంలో మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో టీంలో నాయబ్ తహసీల్దార్, ఇద్దరు ఆర్‌ఐలు, సర్వేయర్, సీనియర్ అసిస్టెంట్/జూనియర్ అసిస్టెంట్, ఎంపీఎస్‌వో స్థాయి కలిగిన ఎనిమిది మంది ఉద్యోగులను నియమించారు. వీరితో పాటు జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్లతో కూడిన ఎనిమిది మంది ఉద్యోగులతో మరో మూడు హెల్ప్ డెస్క్‌లను నియమించారు. జిల్లాలోని పలు తహసీల్దార్ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులకు ఈ బాధ్యతలను అప్పగించారు. ఒక్కో గ్రామాన్ని ఈ 16 మంది అధికారులు, ఉద్యోగులు సందర్శించి అక్కడి రైతులకు భూభారతి చట్టం విధి విధానాలపై అవగాహన కల్పిస్తారు. వారి నుంచి భూ సమస్యలపై అర్జీలు స్వీకరించనున్నారు. ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకు వీరంతా గ్రామంలోనే ఉండనున్నారు. సంబంధిత రైతులు రాతపూర్వక దరఖాస్తులను అందించాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వమే నిర్ణీత ప్రొఫార్మాను జిల్లాకు పంపించింది. అధికారులు వాటిని అందజేయనున్నారు. దాన్ని పూర్తి చేసి అవసరమయ్యే ధ్రువీకరణ పత్రాలను జతచేసి అధికారులకు అందజేయాల్సి ఉంటుంది. వాటిని విచారణ అనంతరం పోర్టల్‌లో నమోదు చేయనున్నారు.

సమస్యలు బోలెడు..

గత ప్రభుత్వం అమలు చేసిన ధరణిలో పలు సమస్యలకు సంబంధించి ఆప్షన్లు లేకపోవడంతో గ్రామాల్లో భూ సమస్యలు పేరుకుపోయాయి. వాటి పరిష్కారం కోసం కొన్నేళ్లుగా బాధితులు అధికారులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. ఇలాంటి వారంతా కొత్త చట్టంపై ఆశలు పెట్టుకున్నారు. సర్వేనంబర్లలో తప్పిదాలు, భూమి మిస్సింగ్, సరిహద్దుల వివాదం, పేర్ల మార్పిడి, డిజిటల్ సిగ్నిచర్, భూ విస్తీర్ణంలో తేడాలు, విరాసత్, సాదాబైనామా వంటి సమస్యలు ఈ సదస్సుల ద్వారా పరిష్కారమై తమకు లబ్ధి చేకూరుతుందని ఆశపడుతున్నారు.

సదస్సుల నిర్వహణ షెడ్యూల్ ఇలా..

భోరజ్ మండలంలో మొత్తం 28 రెవెన్యూ గ్రామాలున్నాయి. ఒక్కోరోజు మూడు గ్రామాల్లో సదస్సులు కొనసాగనున్నాయి. తొలిరోజున కోర్టా, గణేశ్‌పూర్, పూసాయి గ్రామాల్లో నిర్వహించనున్నారు. 6న మిర్జాపూర్, కేదార్‌పూర్, అవాల్‌పూర్, 7న బాలాపూర్, మాండగడ, అకోలి, 8న పిప్పర్‌వాడ, హత్తిఘాట్, హషంపూర్, 9న గిమ్మ(కే), శేఖాపూర్, సావాపూర్, 12న గిమ్మ(బి), డొల్లార, దాదాపూర్, 13న లేఖర్‌వాడ, కామాయి, సిర్సన్న, 14న పొఙ్‌పూర్, గూడ, పెండల్వాడ, 15న తరోడా, కరన్‌వాడీ, రాంపూర్(టి), 16న భోరజ్ గ్రామాల్లో సదస్సులు నిర్వహించనున్నారు. వీటి నిర్వహణకు నోడల్ అధికారిగా ఆదిలాబాద్ ఆర్డీవో బి.వినోద్‌కుమార్ వ్యవహరించనున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

భూభారతి చట్టంపై అవగాహన కల్పించడంతో పాటు సమస్యలను పరిష్కరించేందు కోసమే గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నాం. సంబంధిత రైతులు సదస్సుకు వచ్చి నిర్ణీత ప్రొఫార్మాలో దరఖాస్తులు అందజేయాలి. సమస్యలను క్షేత్రస్థాయిలోనే విచారించి జూన్ 2లోగా వాటిని పరిష్కరిస్తాం. రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలి.

– ఎల్.రాజేశ్వరి, తహసీల్దార్, భోరజ్

బినామీ దందా!

- జొన్నల కొనుగోళ్లలో అక్రమాలు
- మహారాష్ట్ర నుంచి జిల్లాకు తరలింపు
- రైతుల పేరిట దళారుల విక్రయాలు
- చోద్యం చూస్తున్న అధికారులు



మాదాపూర్‌లో అక్రమంగా నిల్వఉంచిన జొన్న బస్తాలను పట్టుకున్న పోలీస్, రెవెన్యూ సిబ్బంది (ఫైల్)

ఇచ్చోడ: జిల్లాలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాల్లో బినామీ రైతుల పేరిట విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. కొంత మంది దళారులు ఆయా కేంద్రాల్లో ఉన్న అధికారులను మచ్చిక చేసుకొని ఇతర ప్రాంతాల నుంచి తీసుకువచ్చిన జొన్నలను మద్దతు ధరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అయితే పట్టా పాస్‌బుక్ ఆధారంగానే విక్రయాలు చేపడుతున్నామని, ఇందులో తాము చేసేదేమి లేదని అధికారులు తప్పించుకుంటున్నారు.

దళారులదే హవా....

జిల్లావ్యాప్తంగా 12 కేంద్రాల ద్వారా ప్రభుత్వం మద్దతు ధరతో జొన్నల కొనుగోళ్లు చేపడుతోంది. ఇచ్చోడ, బోథ్, ఇంద్రవెల్లి, బజార్‌హత్నూర్, బేల, నార్నూర్, తలమడుగు తదితర కేంద్రాల్లో దళారులు మహారాష్ట్ర, తదితర ప్రాంతాల నుంచి తక్కువ ధరకు జొన్నలను కొనుగోలు చేసి ఇక్కడ అధిక ధరకు విక్రయిస్తున్నట్లు సమాచారం.

ధర వ్యత్యాసం ఉండటమే..

ప్రభుత్వం ఏర్పాటు చేసిన జొన్న కొనుగోలు కేంద్రాల్లో క్వింటాలుకు మద్దతు ధర రూ.3,370 ఉంది. మహారాష్ట్ర ఇతర ప్రాంతాల్లో మాత్రం ఈ ధర రూ.1,900 నుంచి రూ.2వేల లోపే పలుకుతోంది. రవాణా, ఇతర ఖర్చులు పోనూ క్వింటాలుకు సుమారు రూ.వెయ్యి వరకు మిగులుతుండడంతో దళారులు ఈ దందా చేపడుతున్నారు. ఒక్కో దళారి సుమారు ఐదు వందల క్వింటాళ్ల వరకు ఇప్పటికే బినామీ రైతుల పేర్లపై విక్రయించినట్లు సమాచారం. ఒక్క ఇచ్చోడ మార్కెట్ పరిధిలోనే పది మందికి పైగా ఈ దందా చేస్తున్నట్లు తెలుస్తోంది.

కొరవడిన నిఘా

ఆయా కేంద్రాల వద్ద వ్యవసాయ, మార్క్‌ఫెడ్, మార్కెటింగ్‌తో పాటు పోలీసు శాఖల నిఘా కొరవడింది. బినామీ రైతులను గుర్తించడంలో అధికార యంత్రాగం పూర్తిగా విఫలమైందనే విమర్శలున్నాయి. కాగా, కొన్ని కేంద్రాల్లో అక్కడి అధికారులు, సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

ఇటీవల పట్టుబడ్డ జొన్నలు

- ఈనెల 1న మహారాష్ట్ర నుంచి జొన్నలను ఓ లారీలో బజార్‌హత్నూర్ తరలించి స్థానిక మార్కెట్‌యార్డులో విక్రయిస్తుండగా రైతులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు లారీని పట్టుకొని స్టేషన్‌కు తరలించారు.
- ఈ నెల 3న ఇచ్చోడ మండలంలోని మాదాపూర్‌లో రేకుల షెడ్డులో అక్రమంగా నిల్వ ఉంచిన 256 క్వింటాళ్ల జొన్నలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.
- ఈ నెల 3న ఇంద్రవెల్లి మండలంలో హీరాపూర్ చెక్‌పోస్టు వద్ద అక్రమంగా తరలిస్తున్న జొన్నలను పోలీసులు, మార్కెటింగ్‌శాఖ అధికారులు పట్టుకున్నారు.

జిల్లాలో జొన్న పంట సాగు వివరాలు

మండలం	రైతులు	సాగైన ఎకరాలు
ఆదిలాబాద్‌రూరల్	3,651	11,135
ఆదిలాబాద్‌అర్బన్	56	181
బేల	2,014	5,880
జైనథ్	5,449	17,638
మావల	237	705
బజార్‌హత్నూర్	2,459	6,699
బోథ్	4,386	11,496
నేరడిగొండ	2,913	6,564
గుడిహత్నూర్	1,500	3,510
ఇచ్చోడ	1,357	5,815
సిరికొండ	862	1,754
భీంపూర్	1,248	3,419
తలమడుగు	3,535	10,407
తాంసి	2,571	7,652
గాదిగూడ	725	1,539
ఇంద్రవెల్లి	2,690	6,388
నార్నూర్	1,367	4,075
ఉట్నూర్	2,144	6,667
మొత్తం	39,764	1,10,901

ఆన్‌లైన్ ఆధారంగానే కొనుగోళ్లు..

రైతుల పేరిట విక్రయిస్తుండడంతో ఏమి చేయలేక పోతున్నాం. పట్టాల ఆన్‌లైన్ ఆధారంగానే కొనుగోళ్లు చేపడుతున్నాం. నిబంధనల ప్రకారమే విక్రయిస్తున్నాం.

– ప్రవీణ్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ డీఎం

క్లుప్తంగా

పేకాడుతున్న 15 మంది అరెస్టు

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ ఫంక్షన్ హాల్ సమీపంలో పేకాడుతున్న 15 మందిని శనివారం రాత్రి అరెస్టు చేసినట్లు సీఐ ఫణిధర్ తెలిపారు. తమకు అందిన పక్కా సమాచారంతో పేకాట శిబిరంపై దాడి చేసి వారి వద్ద నుంచి రూ. 89,160 నగదు, 13 సెల్ ఫోన్లు, ఆరు బైక్‌లు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడిలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బోథ్‌లో..

బోథ్: బోథ్ శివారులో ఆదివారం పేకాడుతున్న ఐదుగురిని ఎస్సై ప్రవీణ్ కుమార్ పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.9,120 నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై మహేందర్

బెల్లంపల్లి: బెల్లంపల్లి రైల్వేస్టేషన్ ముందు ఓ వ్యక్తి నుంచి గంజాయిని ఆదివారం స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ ఎస్సై కె.మహేందర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఒకరు గంజాయి తరలిస్తున్నట్లు పక్కా సమాచారంతో అప్రమత్తమైన పోలీసులు అక్కడికి వెళ్లి పరిశీలించారు. అనుమానాస్పదంగా ఉన్న మధ్యప్రదేశ్ రాష్ట్రం సిహోర్‌కు చెందిన మహ్మద్ మన్సూర్‌ను తనిఖీ చేయగా అతని వద్ద 240 గ్రాముల గంజాయి లభ్యమైంది. గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు టూటౌన్ ఎస్సై వివరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



నందకుమార్ మృతదేహం

నేరడిగొండ: మండలంలోని దూద్‌గండి సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. ఎస్సై శ్రీకాంత్ కథనం ప్రకారం.. ఇచ్చోడ మండలం గేర్జం గ్రామానికి చెందిన యువకుడు జూగ్నక్ నందకుమార్ (27) బైక్‌పై నిర్మల్‌కు పని నిమిత్తం బయల్దేరి వెళ్లాడు. ఈ క్రమంలో మార్గమధ్యలో లారీ వెనుక నుంచి బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో నందకుమార్‌పై లారీ వెళ్లడంతో శరీరం నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతిచెందాడు. లారీడ్రైవర్ అతివేగం, అజాగ్రత్తగా నడపడంతోనే ప్రమాదం జరిగిందని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బాసర చూసొద్దామా..

- చదువుల తల్లి..సరస్వతి అమ్మవారు
- వింతలు, విశేషాల సమాహారం
- ఏటా పెరుగుతున్న భక్తుల రద్దీ



బాసర ప్రధాన ఆలయం

భైంసా: చదువుల తల్లి కొలువుదీరిన బాసర ఇప్పుడు చూసేవారికి ఒకే గ్రామం. అమ్మవారు కొలువైన ఊరని అందరికి సుపరిచితమే. వాస్తవానికి బాసర ఏడు గ్రామాల సమాహారం. వందల ఏళ్ల కిందట బాసరకు వ్యాసపూరి అని పిలిచేవారు. వ్యాసుడు నివసించినందుకు గ్రామానికి ఆ పేరు వచ్చింది. వ్యాసపూరితోపాటు దానిచుట్టూ రత్నాపూర్, రేణుకాపూర్, మాదాపూర్, రవీంద్రాపూర్, మైలాపూర్ గ్రామాలు ఉండేవి. మహ్మదీయుల కాలంలో తరచూ దాడులు, బందిపోట్లు, రజాకార్ల నియంతృత్వాన్ని, ఆకృత్యాలు ఎదురించేందుకు ఈ పల్లెలు ఒక్కటిగా మారి వాసర పేరుతో ఏకమయ్యాయి. కాలక్రమంలో వాసర బాసరగా మారింది. గ్రామానికి ఒక హనుమాన్ మందిరం ఉంటుంది. ఏడు ఊర్ల సూచికగా బాసరలో ఏడు హనుమాన్ ఆలయాలు ఉన్నాయి. ఆ గ్రామాలు అప్పుడున్న స్థలంలో ఇప్పటికి హనుమాన్ ఆలయాలున్నాయి. బాసర రైతులు సాగుచేసే భూముల్లో పురాతన ఆలయాల ఆనవాళ్లు కనిపిస్తాయి. ఇప్పటికి రెవెన్యూ రికార్డుల్లో సైతం ఆ గ్రామాల పేర్లు ఉన్నాయి.

పట్వారీగా పనిచేసి యువకులను ఐక్యం చేసి..

అప్పటి రేణుకాపూర్ గ్రామ పట్వారీగా పనిచేసే మక్కాజీ పటేల్ యువకులను ఐక్యం చేసి అమ్మవారి ఆలయాన్ని కాపాడాడు. మహ్మదీయుల పాలనలో బాసర తరచూ ముష్కరుల దోపిడీకి గురయ్యేది. ఆలయంలో విగ్రహాల ధ్వంసం, అమ్మవారి ఆభరణాలు, కానుకలు అపహరించేవాళ్లు. పట్వారీ మక్కాజీ పటేల్ నిరంతరం గస్తీకాస్తు తురుష్కుల దండయాత్రలను ఎదురించాడు. బందీపోట్ల దాడులను సమర్థంగా ఎదుర్కొన్నాడు. భక్తులకు, గ్రామానికి రక్షణగా నిలిచాడు. ఆ సమయంలోనే పక్కనే ఉన్న ఆరు గ్రామాలు బాసరలో విలీనమయ్యాయి. ఆలయాన్ని కాపాడిన ఆయన విగ్రహం ఇప్పటికి గర్భగుడి పక్కనే గల దత్తాత్రేయ మందిరం గోడను ఆనుకుని ఉంటుంది.

పుణ్యస్థలి ఇది..

బాసర వ్యాసమహార్షి సృష్టి. అవ్యక్త రూపిణిగా ఉన్న అమ్మవారిని తన మనోనేత్రంతో చూసి దీక్షతో ప్రతిష్ఠించిన వ్యాసుని హితిహాసం అందరికి తెలిసిందే. అయితే పలు కారణాలతో దేవతలు ఇక్కడ సంచరించిన ఆనవాళ్లు ఉన్నాయి. బాసర ఆలయం చెంత అష్టముఖి కోనేరు కనిపిస్తుంది. 8 దిక్కుల్లో 8 మంది దేవతలు సరోవరం చుట్టూ స్నానమాచరించి నివసించిన స్థలాలుగా ఇప్పటికి భావిస్తారు. పురాణగాథల పరంగా శాపగ్రస్తులైన ఇంద్రుడు, సూర్యుడు, వినాయకుడు, విష్ణువు, వాల్మీకి, శంకరుడు అమ్మవారిని పూజించి శాపవిముక్తులైనట్లు తెలుస్తోంది. దేవతల రాజైన ఇంద్రుడి గుడి లోకాలకు వెలుగునిచ్చే సూర్యుని ఆలయం ఇక్కడ ఉంది. ఈ విషయం వెలుగులోకి రాలేదు.

రాతిశిల వింత ధ్వనులు



వేదవతి శిల

బాసర బస్టాండ్ సమీపంలో రాతిశిల వింత ధ్వనులను వినిపిస్తుంది. స్థానికులు వేదవతి శిల అని పిలుస్తారు. బండరాయితో ఈ శిలను కొడితే వీణ తీగలను మీటినట్లు, కంచుపాత్రలను కొడితే వచ్చే శబ్దంలా వినిపిస్తాయి. ఈ శిలలో అమ్మవారి ఆభరణాలు ఉన్నాయని అంటుంటారు. రాతి వేదికపై నిలబడినట్లు ఉండే ఈ వేదవతి శిలను భక్తులు దర్శించుకుంటారు.

పాపహరేశ్వర ఆలయం

బాసర విశిష్టతకు, వైభవానికి పాపహరేశ్వర ఆలయం చిరునామా. కాకతీయుల కాలం నాటి ఈ ఆలయం బాసర చరిత్రకు సజీవ సాక్ష్యం. అద్భుత శిల్పకలతో అలరారిన ఈ రాతి నిర్మిత ఆలయం చూసేందుకు భక్తులు ఆసక్తి కనిపిస్తుంటారు. నాలుగు దిక్కుల నాలుగు రాతిమండపాలు పుష్కరిని ఇక్కడ కనిపిస్తుంది. పరుశురాముడే పాపహరేశ్వర ఆలయాన్ని నిర్మించాడని చెబుతుంటారు.



పాపహరేశ్వర ఆలయం

బస్సుకు ముందే రైలు వచ్చింది

బస్సు రాక ముందే బాసరలో బల్బు వెలగకముందే రైలు వచ్చిందని స్థానికులు ఇప్పటికి చెబుతుంటారు. ఆంగ్లేయులు పరిపాలించిన ఉత్తర భారతంతో పోలిస్తే నిజాంల ఏలుబడిలో ఉన్న తెలంగాణ ప్రాంతంలో రైల్వే వ్యవస్థ అంతగా అభివృద్ధి చెందలేదు. అప్పుడప్పుడే ఆధునిక నాగరికత పురుడు పోసుకుంటున్న సమయంలోనే బాసరకు రైలు మార్గం ఏర్పడింది. మరట్వాడా ప్రాంతంలో 30 లక్షల ఎకరాల్లో సాగయ్యే పత్తి పంటను జిన్నింగ్ మిల్లులు ఉన్న ఔరంగాబాద్, జల్నా పట్టణాలకు చేర్చడానికి తన రాజధాని హైదరాబాద్‌కు అనుసంధించడానికి నిజాం ప్రభువు 1899లో గోదావరి ర్యాలీ రైల్వేపేరుతో రైలు మార్గం ఏర్పాటు పనులు ప్రారంభించాడు. 1902లో 623 కిలోమీటర్ల రైలుమార్గం నిర్మించి రాకపోకలు ప్రారంభించాడు. బాసరకు బస్సు రాక ముందే రైలు వచ్చిందని ఈ ప్రాంతవాసులు ఇప్పటికి చెబుతుంటారు.

అటవీహక్కు భూముల పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

ఇంద్రవెల్లి: మండలంలోని పిప్రి శివారు గల అటవీ హక్కు భూములను ఐటీడీఏ అధికారులు ఆదివారం పరిశీలించారు. గ్రామ రైతులతో కలిసి ఐటీడీఏ డీడీ జాదవ్ అంబాజీ వాటిని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జాదవ్ మాట్లాడుతూ సోలార్ జల వికాసంలో భాగంగా రాష్ట ప్రభుత్వం త్వరలో పైలెట్ ప్రాజెక్టును త్వరలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ప్రారంభిస్తారన్నారు. ఈ క్రమంలో పిప్రిలో అటవీ హక్కు పత్రాలున్నా భూములను పరిశీలించినట్లు తెలిపారు. డీటీ రాథోడ్ సరోజి, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఉయిక విష్ణు, కాంగ్రెస్ నాయకులు కోడప శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

ఎయిర్ పిస్టల్ కలకలం

- మావల చెరువు సమీపంలో లభ్యం

ఆదిలాబాద్‌రూరల్: మావల చెరువు సమీపంలో ఆదివారం ఎయిర్ పిస్టల్ కలకలం రేపింది. గుర్తుతెలియని వ్యక్తులు దీన్ని పారేయడంతో అటువైపు వెళ్తున్న గ్రామస్తులు చూసి ఒక్కసారిగా భయభ్రాంతులకు గురయ్యారు. ఈ విషయమై మావల పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటన స్థలానికి చేరుకుని ఎయిర్ పిస్టల్‌ను స్వాధీనం చేసుకున్నారు. కాగా, ఇది ఆయుధాలకు సంబంధించిన పిస్టల్ కాదని, ఎయిర్ పిస్టల్ అని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి తెలిపారు. దీనికి ఎలాంటి లైసెన్స్ అవసరం ఉండదని, ఎగ్జిబిషన్‌లో బెలూన్లు పగులగొట్టడానికి వినియోగిస్తారని పేర్కొన్నారు. ఎవరు పడేసి ఉంటారోననే కోణంలో విచారణ చేపడుతున్నట్లు వివరించారు.

పాముకాటుకు వివాహిత మృతి



నేరెళ్ల రజిత(ఫైల్)

కడెం: పాముకాటుకు వివాహిత మృతిచెందిన మండలంలోని పెద్దూర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు..పెద్దూర్‌కు చెందిన నేరెళ్ల రజిత (35), దాసు భార్యభర్తలు. వీరికి ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు సంతానం. గ్రామంలో అద్దె ఇంట్లో ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అద్దె ఇంటి డబ్బుల భారంతో గత కొన్నినెలలుగా పెద్దూర్ సమీపంలోని డబుల్ బెడ్రూం ఇంటికి వెళ్లారు. ఆదివారం ఉదయం ఇంటి పరిసరాల్లో రజిత తోటకూర తెంపుతుండగా పాము కాటేసింది. కుటుంబ సభ్యులు ఆమెను కడెంలో ప్రథమ చికిత్స చేయించి, నిర్మల్ ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. తల్లి మృతదేహం వద్ద కూతుళ్ల రోదన అందరిని కంటతడి పెట్టించింది. పెద్ద కూతురు వివాహం నిశ్చయం కాగా, అంతలోనే తల్లి మృతితో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయి. భర్త ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు.



మృతదేహం వద్ద రోదిస్తున్న కూతురు

ఆదివాసీ పర్ధాన్ సమాజ్ ఎన్నిక

ఇంద్రవెల్లి: ఉమ్మడి జిల్లా ఆదివాసీ పర్ధాన్ సమాజ్ నూతన కార్యవర్గాన్ని మండలకేంద్రంలో ఆదివారం ఎన్నుకున్నారు. ఆదివాసీ పర్ధాన్ సమాజ్ హక్కుల పోరాట సమితి(ఏపీఎస్‌హెచ్‌పీఎస్)తో నామకరణ అనంతరం ఎన్నిక జరిగింది. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా దుర్వ నగేశ్, గౌరవ అధ్యక్షుడిగా ఉయిక సుదర్శన్, ప్రధాన కార్యదర్శిగా గేడం నిరంజన్, ఉపాధ్యక్షుడిగా గేడం భరత్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కనక ప్రభాకర్, కార్యదర్శిగా పెందోర్ అంకుష్, కన్వీనర్‌గా పెందోర్ మారుతి, కోకన్వీనర్‌గా ఆడా కాంతారావ్, కోశాధికారిగా సిడాం వామన్‌రావ్, సలహాదారుగా తొడసం ప్రశాంత్, గేడం జ్ఞానేశ్వర్, ఆర్క ఖమ్ము, మడావి లక్ష్మణ్, మెస్రం శేషనారాయణ్, పెందోర్ ధర్ము, కోవా వినోద్, కుర్సెంగా యాదవ్‌రావ్, పూసం నాందేవ్ ఎన్నికయ్యారు.



ఎన్నికపై చర్చిస్తున్న పర్ధాన్ సమాజ్ పెద్దలు

సత్ఫలితాలిస్తున్న గడ్డిమైదానాలు

- వన్యప్రాణుల సంతతి వృద్ధికి చర్యలు
- వచ్చే వర్షాకాలంలో పెంచేందుకు అటవీశాఖ దృష్టి
- జన్నారం అటవీ డివిజన్‌లో విత్తనాల సేకరణ
- భద్రపర్చే పనిలో అధికారులు



విత్తనాల కోసం ఎండిన గడ్డిని కోస్తున్న సిబ్బంది

జన్నారం: వన్యప్రాణుల సంతతి వృద్ధి కోసం గత ఆరేళ్లుగా జన్నారం అటవీ డివిజన్‌లో పెంచుతున్న గడ్డి మైదానాలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. వచ్చే వర్షాకాలంలో వాటిని విరివిగా పెంచేందుకు అటవీ శాఖ దృష్టి సారించింది. కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్ జన్నారం, ఇందన్‌పెల్లి, తాళ్లపేట రేంజ్‌లో వన్యప్రాణులు ఇష్టపడి తినే గడ్డి విత్తనాలు సేకరించి, భద్రపర్చే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. గత సంవత్సరం వరకు 800 హెక్టార్లలో గడ్డి మైదానాలు ఏర్పాటు చేయగా, ఈ ఏడాది మరో 62 ఎకరాల్లో గడ్డి పెంపకం చేపట్టనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

గడ్డిని విరివిగా పెంచేందుకు..

అడవిలో వన్యప్రాణులు గడ్డిని తినేందుకు అధికారులు గత ఆరేళ్ల క్రితం గడ్డి మైదానాలు ఏర్పాటు చేశారు. నిపుణుడు మురద్కర్ ఇక్కడి అధికారులకు శిక్షణ ఇచ్చారు. వన్యప్రాణులు గడ్డిని తినేందుకు ఇష్టపడతాయని, గడ్డి పెంపకం ద్వారా వాటి సంఖ్య పెరుగుతుందని, దీంతో ఈ ప్రాంతంలో పులులు ఆవాసం ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. క్లోరిస్‌బాల్ బుటా, గెలె క్షుంటజం, డిజిటేరియా, ఐసోలియా తదితర పాటు మొత్తం 12 రకాల గడ్డి జాతులను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. గడ్డి పెంపకం ద్వారా పులి గడ్డిమాటున వన్యప్రాణులను సులభంగా వేటాడే అవకాశం ఉందని అధికారుల యోచన.

సేకరించి, భద్రపర్చి..

అడవిలో సహజసిద్ధంగా పెరిగిన గడ్డి నుంచి విత్తనాలు సేకరిస్తారు. వీటినిపొడిగా చేయడానికి ఎండలో ఆరబెడుతారు. తర్వాత పాలిథిన్ కవర్లలో వాటిని భద్రపరుస్తారు. సంచుల్లో నింపి తేమ తగులకుండా గదిలో ఉంచుతారు. వర్షాకాలం రాగానే విత్తనాలను అనుగుణంగా ఉన్న ప్రాంతాల్లో చల్లుతారు. అదేవిధంగా మొక్కల, చెట్ల విత్తనాలను దట్టమైన అటవీ ప్రాంతంలో చల్లడంతో గడ్డి పెరుగుతుంది. కొన్ని గడ్డిజాతులు సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్, డిసెంబర్‌లో పెరిగి విత్తనాలు రాగా, మరి కొన్ని జాతులు జనవరి నుంచి ఏప్రిల్ మధ్యలో విత్తనాలు ఇస్తాయని అధికారులు పేర్కొంటున్నారు.

ముందంజలో జన్నారం డివిజన్

గడ్డి మైదానాల ఏర్పాటులో జన్నారం అటవీ డివిజన్ ముందుంజలో ఉంది. వివిధ అటవీ డివిజన్, టైగర్‌జోన్ ప్రాంతాల నుంచి అధికారులు జన్నారం అటవీ డివిజన్‌లో పర్యటించి, గడ్డి క్షేత్రాల నిర్వహణ, చేపడుతున్న పనుల తీరును తెలుసుకుంటున్నారు. వారి ప్రాంతంలో గడ్డి క్షేత్రాలు పెంచుతున్నారు. వన్యప్రాణుల కోసం అక్కడే నీరు, ఆహారం తదితర సౌకర్యాలు కల్పిస్తున్నారు.

మరో 62 ఎకరాల్లో ప్రతిపాదనలు



జన్నారం అటవీ డివిజన్‌లో ఇప్పటివరకు 800 హెక్టర్ల వరకు గడ్డి మైదానాలు ఏర్పాటు చేశాం. వచ్చే వర్షాకాలంలో మరో 62 ఎకరాల్లో పెంచనున్నాం. ఇందుకు తగిన ప్రతిపాదనలు పంపాం. విత్తనాలు సేకరించి, భద్రపర్చాం. అనువైన ప్రాంతంలో చల్లి సహజ సిద్ధంగా గడ్డి పెరిగేలా తగిన చర్యలు తీసుకుంటున్నాం. ఇక్కడ సేకరించిన విత్తనాలను ఇదే డివిజన్‌లో కాకుండా అవసరం ఉన్న చోట వినియోగిస్తున్నాం.

– శివ్ ఆశిష్‌సింగ్, జిల్లా అటవీశాఖ అధికారి

కొత్త గనులు సాధించుకోవాలి

- చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

చెన్నూర్: రాష్ట్రంలో కాలం చెల్లిన పాత గనులు మూతపడుతాయని, కొత్త గనులు సాధించుకోవాల్సిన అవసరం ఉందని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో 26 నియోజకవర్గాల్లో సింగరేణి గనులు విస్తరించి ఉన్నాయని తెలిపారు. తెలంగాణ ప్రాంతంలో అతిపెద్ద సంస్థ సింగరేణి అని పేర్కొన్నారు. గనులతోనే నియోజకవర్గాలు అభివృద్ధి చెందుతాయన్నారు. సింగరేణి షేప్ నిధులతో పారిశ్రామిక ప్రాంతాలు అభివృద్ధికి నోచుకుంటాయన్నారు. మూసివేసిన గనుల స్థానంలో కొత్త గనుల ఏర్పాటు విషయంపై సీఎం రేవంత్ రెడ్డితో చర్చించి సమావేశం ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. కొత్త గనుల ఏర్పాటుకు కృషి చేస్తానని చెప్పారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వివేక్ వెంకటస్వామి

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువులతో గర్మిళ్ల ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు



సమ్మేళనంలో మందమర్రి సింగరేణి హైస్కూల్ పూర్వ విద్యార్థులు

జిల్లాకేంద్రంలోని గర్మిళ ఉన్నత పాఠశాల 1991–92 బ్యాచ్, మందమర్రిలోని సింగరేణి హైస్కూల్‌లో 1999–2000 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. మంచిర్యాలలోని టీఎన్జీవో ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో గర్మిళ ఉన్నత పాఠశాల పూర్వవిద్యార్థులు సందడి చేశారు. ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి గుర్తులను నెమరువేసుకున్నారు. అప్పటిగురువులు పీఎంఎస్ చారి, దాసరి శ్రీనివాస్, మాలవీదేవి, ప్రభులింగం, భీమ్‌రావుతోపాటు ప్రస్తుత హెచ్‌ఎం కరుణాకర్‌ను సన్మానించారు. మాజీ ఎంపీపీలు బేర సత్యనారాయణ, శారద (సారంగపూర్), తహసీల్దార్ గోవింద్ తోపాటు మురళి, రమేశ్, దీవ, గోపి, మల్లికార్జున్, రవి పాల్గొన్నారు. మంచిర్యాలలోని టీఎన్జీవో ఫంక్షన్ హాల్‌లో మందమర్రి సింగరేణి హైస్కూల్ పూర్వ విద్యార్థులు పాత జ్ఞాపకాలను పంచుకున్నారు. అందరూ కలిసి భోజనం చేశారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.

– మంచిర్యాలఅర్బన్/మందమర్రిరూరల్

1,270 దేశీదారు బాటిళ్లు స్వాధీనం

- ఇద్దరి అరెస్ట్, రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): అక్రమంగా మహారాష్ట్ర నుంచి జిల్లా కేంద్రానికి దేశీదారు బాటిళ్లను ఆటోలో తరలిస్తున్న ఇద్దరిపై దాడి చేసి పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ విజేందర్ తెలిపారు. ఆదివారం ఎక్సైజ్ కార్యాలయంలో ఈ మేరకు వివరాలు వెల్లడించారు. ఆదిలాబాద్ పట్టణంలోని గాంధీనగర్, వడ్డెర కాలనీలకు చెందిన సూర రవి, చింతల సుజాత మహారాష్ట్ర నుంచి ఆటోలో దేశీదారు బాటిళ్లు తరలిస్తున్నట్లు సమాచారంతో డొల్లార శివారులో పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వారి వద్ద నుంచి 1,270 దేశీదారు బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటి విలువ రూ.45,720 ఉంటుందని పేర్కొన్నారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. ఈ దాడుల్లో డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ముత్యం, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ అక్బర్ హుస్సేన్, సిబ్బంది ఉన్నారు.



స్వాధీనం చేసుకున్న దేశీదారు బాటిళ్లు

ప్రైవేట్ బస్సును ఢీకొన్న ఆటో

గుడిహత్నూర్: మండలంలోని జాతీయ రహదారి 44 పై సీతాగొంది గ్రామ సమీపంలో ఆదివారం ప్రైవేటు బస్సును వెనుక నుంచి ఆటో ఢీకొన్న ఘటనలో ఆరుగురికి గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల తెలిపిన వివరాలు.. మండలంలోని హర్కాపూర్‌కు చెందిన కొందరు ఆటోలో మన్నూర్ నుంచి ఆదిలాబాద్‌కు వెళ్తోంది. సీతాగొందిలో గుడిహత్నూర్ వైపు నుంచి ఆదిలాబాద్ వెళ్తున్న ప్రైవేటు బస్సును వెనుక నుంచి ఆటో ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ భీంరావుతోపాటు శాంతాపూర్ గ్రామానికి చెందిన భార్యభర్తలు లస్మన్న, పోసాని, గురుజ గ్రామానికి చెందిన నేతుల వనజ, అను, సొమ్యలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని స్థానికుల సహాయంతో 108లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేందర్ పేర్కొన్నారు.

తండ్రి మందలించాడని కూతురు ఆత్మహత్య



వైష్ణవి (ఫైల్)

రెబ్బెన(ఆసిఫాబాద్): తండ్రి మందలించాడని మనస్తాపం చెందిన కూతురు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. మండలంలోని గంగాపూర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్సై చంద్రశేఖర్ కథనం ప్రకారం..గ్రామానికి చెందిన వడాయి రవీందర్–రుకుంబాయి దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. వీరిలో చివరి సంతానమైన వైష్ణవి (17) ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది. కళాశాలకు వేసవి సెలవులు రావడంతో ఇంటివద్దే ఉంటోంది. గత నెల 29న తల్లిదండ్రులు వ్యవసాయ పని ముగించుకుని సాయంత్రం ఇంటికి చేరుకున్నారు. వైష్ణవి ఏ పని చేయకుండా ఖాళీ కూర్చుని ఉంది. చదువు ఒక్కటే సరిపోదు రోజు కష్టపడి పని చేసి ఇంటికి వచ్చి అన్నం వండుతున్న అమ్మకు కాస్త సహాయం చేయవచ్చు కదా అంటూ తండ్రి మందలించాడు. ఆరోజు ఆమె రాత్రి భోజనం చేయకుండా తన గదిలోకి వెళ్లింది. ఆ తర్వాత వాంతులు చేసుకోవడంతో తల్లిదండ్రులు అడుగగా గుర్తుతెలియని పురుగుల మందు తాగానని చెప్పింది. వారు వెంటనే ఆటోలో బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అప్పటికి ఆరోగ్యం మెరుగపడకపోవడంతో ఆదివారం ఉదయం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే వైష్ణవి మృతి చెందినట్లు నిర్ధారించారు. తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.